క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

యాడికి: మండలంలోని లక్షుంపల్లెలో మంగళవారం ఉదయం 7.30 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

పెద్దపప్పూరు: మండలంలోని నరసాపురంలో మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

పామిడి: మండల కేంద్రంలోని 4వ వార్డులో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

'వెన్నపూస' విస్తృత ప్రచారం



ప్రచారం చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

గుత్తి: పట్టణంలో సోమవారం పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రా రెడ్డి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వెన్నపూస రవీంద్రారెడ్డి పట్టణంలోని మోడల్ స్కూల్లో ఉపాధ్యాయులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. రిటైర్డ్ లెక్చరర్ కొండారెడ్డి, వెన్నపూస రాంభూపాల్‌రెడ్డి, అయూబ్ , రిజ్వాన్, షాకీర్, శ్రీనాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పసిబిడ్డలను పొదల పాలు చేయొద్దు

గుంతకల్లుటౌన్: అనుకోని పరిస్థితుల్లో గర్భం దాల్చి కన్న పసిబిడ్డలను పొదల పాలు చేయకుండా ప్రభుత్వాస్పత్రిలోని ఊయలలో వేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఆమె ఊయలను ప్రారంభించారు. కన్నబిడ్డను వద్దనుకున్నట్లయితే ఆ బిడ్డను రోడ్డు పక్కన, చెత్తకుప్పల్లో పడేయవద్దని ఆమె కోరారు. అనాథ బిడ్డలను గుర్తిస్తే వెంటనే డయల్ 100కు కాల్ చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్, సీడీపీఓ నాగమణి ఉన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

గుత్తి: ప్రమాదవశాత్తు మట్టి పెళ్లలు మీద పడి సుధీర్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. కొజ్జేపల్లి గ్రామానికి చెందిన సుధీర్ మరికొంత మంది కలిసి ట్రాక్టర్‌లో గుత్తి చెరువుకు వెళ్లారు. చెరువులో మట్టిని ట్రాక్టర్‌కు లోడ్ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు మట్టి పెళ్లలు సుధీర్‌పై పడ్డాయి. తీవ్రంగా గాయపడిన అతడిని గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆవు తగిలి..

గార్లదిన్నె: ట్బాలపల్లిలో సోమవారం ఆవు తగిలి కింద పడి ఓ మహిళకు గాయాలయ్యాయి. 108 సిబ్బంది వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రవణమ్మ ఇంటి వద్ద పశువులు కట్టేస్తుండగా ఆవు తగలడంతో కింద పడి ఎడమకాలుకు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆమెను 108లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రజా సంకల్పయాత్ర చరిత్రాత్మకం

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి





శింగనమలలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తనయులు హర్ష , సాయి ప్రతాపరెడ్డి

శింగనమల: ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర చరిత్రాత్మకమని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్ర పూర్తయిన నాలుగేళ్లయిన సందర్భంగా శింగనమలలో సంబరాలు నిర్వహించారు. ముందుగా వైఎస్సార్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పాదయాత్రలో లక్షల మందిని స్వయంగా కలిసి సమస్యలు తెలుసుకున్నారన్నారు. పాదయాత్రకు లక్షలు మంది వచ్చిన ఒక చిన్న అపశృతి కూడా జరగలేదన్నారు. కాని చంద్రబాబు చేసిన రోడ్డు షోల్లో డ్రోన్ షాట్ల కోసం ప్రజల ప్రాణాలను బలితీసుకున్నారని విమర్శించారు. డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, ఎంపీపీ యోగేశ్వరి, బీకేఎస్ జెడ్పీటీసీ భాస్కర్, సర్పంచ్‌లు నాగమునెమ్మ, వెంకట్రాముడు, వైఎస్సార్‌సీపీ నేత నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో జగనన్న చెరగని ముద్ర

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రజల హృదయాల్లో ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెరగని ముద్ర వేసుకున్నారని ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్ పేర్కొన్నారు. ప్రజా సంకల్ప యాత్ర 4 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం మండల మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయం ఎదుట ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న పాదయాత్రలో సమస్యలు తెలుసుకుని మేనిఫెస్టోను తయారు చేశారన్నారు. అధికారంలోకి వచ్చాక రెండేళ్లలోపు మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆలూరి రమణారెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి, సొసైటీ అధ్యక్షులు వెంకటరెడ్డి, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, ముసలన్న, కొండమ్మ, చేపల రమణ, కాలవ నారాయణస్వామి, చెదుల్ల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, పురుషోత్తం, బూసీ, సాకే లక్ష్మీనారాయణ, కొండన్న, వరికూటి కాటమయ్య, శేషానందరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, నాగముణి, ప్రసాద్, మండ్లశివ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి

గుంతకల్లుటౌన్: ఏపీ సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప అన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్ర నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మెయిన్‌రోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి ఆ పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజల కష్టాలను కళ్లారా చూసిన వైఎస్.జగన్ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలో పేర్కొన్న 98 శాతం హామీలను అమలు చేసి చరిత్ర సృష్టించారన్నారు. నాయకులు తిక్కస్వామి, మహదేవ, సోమిరెడ్డి, గోవింద్‌నాయక్, ఎల్లప్ప, మనోహర్, సిపాయిబాషు, చిన్నరాయుడు, వంశీ, హనుమేష్, రామాంజి, చిన్నా, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లుటౌన్: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పేదల అభ్యున్నతే ధ్యేయంగా జగనన్న పాలన

తాడిపత్రి టౌన్ : పేదలల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే తనయులు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, కేతిరెడ్డి సాయి ప్రతాపరెడ్డి పేర్కొన్నారు. స్థానిక భగత్‌సింగ్ నగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ప్రజా సంకల్పపాదయాత్ర సోమవారంతో నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హత కల్గిన ప్రతి ఒక్కరికి జగనన్న పాలనలో సంక్షేమ పథకాలు అందాయన్నారు. బడుగు, బలహీన వర్గాల గుండెల్లో జగనన్న నిలిచిపోయారన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



28వ వార్డులో ముగ్గులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సను

గుంతకల్లుటౌన్: జగనన్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని 24, 12, 1, 28, 35, 3 వార్డుల్లో ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్‌లు నైరుతిరెడ్డి పరిశీలించారు. 28వ వార్డులో అత్యధిక 85 మంది మహిళలు ముగ్గులు వేశారు. కౌన్సిలర్లు ప్రభాకర్, గంగమ్మ, వెంకటేశ్వర్లు, నీలావతి, కుమారి, నాగరత్నమ్మ, మెహరున్నీసా, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, సీఎంఎం భవానీ, సీఓలు పాల్గొన్నారు.

బైక్ అపహరణ

గుత్తి రూరల్: తొండపాడు గ్రామంలో హరి కేశవులు అనే రైతు బైక్‌ను అపహరించారు. బాధితుడి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన హరి కేశవులు సోమవారం ఉదయం పొలం గట్టుపై బైక్‌ను పార్క్ చేసి పనులు చేసుకునేందుకు వెళ్లాడు. పనులు ముగించుకొని వచ్చి చూడగా బైక్ కనబడలేదు. పొలం పరిసరాల్లో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆప్యాయంగా పలకరిస్తూ.. సంక్షేమాన్ని వివరిస్తూ



వేములపాడులో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



పామిడిలో సంక్షేమ లబ్ధిని తెలియజేస్తున్న ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి

యాడికి: ప్రజలతో మమేకమవుతూ ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తూ తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఎన్ తిమ్మాపురం, వేములపాడులో ముందుకుసాగారు. సోమవారం ఉదయం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి మూడున్నరేళ్లలో చేకూరిన లబ్ధిని తెలియజేశారు. ఏమైన సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగుతున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇంటికే చేస్తున్న ఘనత జగనన్నకే దక్కిందన్నారు. నిరంతరం ప్రజల కోసం పరితపిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించడం, ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకోవడంలో భాగంగా సీఎం జగన్ ఆదేశాల మేరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అంతకు ముందు సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

సచివాలయం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ప్రారంభం

వేములపాడు గ్రామంలో రూ.35 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.17.50 లక్షలతో వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రారంభించారు. గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలకు నాడు-నేడు రెండో విడత కింద వంట గదిని నిర్మించాలని హెచ్ఎం గాయత్రి ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో సర్పంచు ఓంకారమ్మ, ఉప సర్పంచు టీపీ ప్రసాద్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలారమేష్ బాబు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, సాంబశివుడు, డీలరు ఆది, రసూల్, కుళ్లాయి రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రమానందరెడ్డి, అమర్‌నాథరెడ్డి, రామేశ్వరరెడ్డి, కుమార్‌గౌడ్, రాజా, శ్రీరామిరెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజల అభ్యున్నతి

పెద్దపప్పూరు: సంక్షేమ పథకాలు ప్రజల అభ్యున్నతికి దోహదం చేస్తున్నాయని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. సోమవారం చీమలవాగుపల్లిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం మూడున్నరేళ్లలో అందించిన లబ్ధిని వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడేళ్లలో దేవుడి దయ, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ప్రజలందరికీ మంచి చేశామని, ఇకపై కూడా చేస్తామని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని ప్రజలందరూ ఆశీర్వదిస్తున్నారన్నారు. ప్రభుత్వానికి ప్రజలందరి మద్దతు ఉంటుందని అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో తెగేసి చెబుతున్నారన్నారు. మేనిఫెస్టోలోని 98 శాతం హామీలను అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు రమాదేవి, ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి, సర్పంచు వీకే సుమతి, ఎంపీటీసీ శంకరయ్య, కోఆప్షన్ సభ్యుడు హాజీవలి, నాయకులు రవిప్రసాద్ రెడ్డి, చీమలవాగుపల్లి రంగేశ్వర్‌రెడ్డి, ముచ్చుకోట అమర్‌నాథరెడ్డి, చిక్కేపల్లి రామేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

జగనన్నతో రామరాజ్యం

పామిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన రామరాజ్యాన్ని తలపిస్తోందని ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మాలవీధి, దుర్గమ్మ వీధుల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం మూడున్నరేళ్లలో అందించిన లబ్ధిని వివరించారు. ఈసందర్భంగా స్థానికులు పందుల బెడద, డ్రైనేజీ, సీసీరోడ్లు, కరెంటు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను సైతం నెరవేరుస్తూ సీఎం జగన్ జనరంజక పాలన అందిస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన ప్యాకేజీ పుత్రుడు, పవన్ కళ్యాణ్‌ను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. అధికారం కోసం మొసలి కన్నీరు కారుస్తున్న బాబు, సినీ డైలాగ్‌లతో గారడీ చేస్తున్న పవన్‌కు ప్రజలు బుద్ధిచెప్పే రోజులు దగ్గరపడ్డాయన్నారు. పక్షవాతంతో బాధపడుతున్న ఓబులేసుకు అనే వ్యక్తికి ఎమ్మెల్యే రూ.5 వేలు అందించారు. మండల ఇన్‌ఛార్జ్ జానకిరామిరెడ్డి, మండల కన్వీనర్ కే నారాయణరెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు చైర్మన్ గౌరప్ప, నాయకులు చుక్కలూరు రామకృష్ణారెడ్డి, ఆర్‌సీ వెంకట్రామిరెడ్డి, బీసీ సెల్ పట్టణ కన్వీనర్ చీమల నగేష్, బీ ఆసిఫ్, ఓసీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమ్మెత లక్ష్మి, జోజోడే కుమార్, బొల్లు వెంకట్రామిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, పార్వతీశ్వర్‌రెడ్డి, చుక్కలూరు రామచంద్రారెడ్డి, టీటీ నాగభూషణ్‌రావు, చీమల అమర్‌నాథ్, సింగరప్ప, పుంజా నగేష్‌యాదవ్, రామిరెడ్డి, బయపరెడ్డి, నెల్లి హనుమంతరెడ్డి, తిరుమలరెడ్డి, బీసీ సెల్ రూరల్ కన్వీనర్ ఓబులేసు, హరినాథ్‌రెడ్డి, నక్కా ఓబులేసు, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి టౌన్ : నవరత్నాల పథకాల అమలుతో జగనన్న పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. కాల్వగడ్డ వీధిలో సోమవారం సాయంత్రం ఆయన జన చైతన్య యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖ వార్డు సెక్రటరీలను ఆదేశించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలన ప్రజలకు తెలియచేశారు. టీడీపీ అసత్యపు ప్రచారాలను నమ్మవద్దని, ఓటు అనే ఆయుధం ద్వారా గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట కౌన్సిలర్ ఆకుల చిన్ననాగిరెడ్డి, మాజీ కౌన్సిలర్లు బాబు, సాయి, నాయకులు కందిగోపుల మురళీ ప్రసాద్‌రెడ్డి, వేణు, బాబా, రామచంద్ర, వాసుదేవ రెడ్డి, బషీర్, షబీర్, ప్రసాద్, లక్ష్మీరంగయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పోలీసులు పని చేస్తేనే చైర్మన్ అయ్యావ్'



మాట్లాడుతున్న మురళీ ప్రసాద్‌రెడ్డి

తాడిపత్రి: మున్సిపల్ ఎన్నికల్లో పోలీసులు నిక్కచ్చిగా పనిచేస్తే మున్సిపల్ చైర్మన్ పీఠం ఎక్కగలిగావని, ఇదే విషయాన్ని నీవే స్వయంగా అంగీకరించడంతోపాటు డీఎస్పీ వీఎన్‌కే చైతన్యను సన్మానించేందుకే వెళ్లగా ఆయన తిరస్కరించిన విషయాన్ని మరిచావా' అంటూ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కందిగోపుల మురళీ ప్రసాద్‌రెడ్డి జేసీ ప్రభాకర్‌రెడ్డికి గుర్తు చేశారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయనవ విలేకరులతో మాట్లాడారు. జేసీ సోదరులు పోలీసులను చిన్నచూపు చూసేవారని, ఇప్పుడు పోలీసులు నిక్కచ్చిగా పని చేస్తుండటాన్ని జీర్ణించుకోలేే అనుచిత వ్యాఖ్యలు చేయడంతోపాటు ప్రైవేటు కేసులు వేయిస్తున్నారన్నారు. నెల క్రితం అస్మిత్‌రెడ్డి వార్డు పర్యటనలో ఆయన అనుచరులు, టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నేతలపై దాడి చేయడంతో పోలీసులు శాంతి భద్రతల విషయమై పర్యటనలకు అనుమతి తీసుకోవాలని కోరారన్నారు. అయితే పోలీసులు అనుమతి తీసుకునేందుకు నామోషీగా భావించి దౌర్జన్యంగా పర్యటనలు చేసుందుకు పూనుకున్నావా అంటూ జేసీని ప్రశ్నించారు. 'అప్పట్లో సీఐ రఘువీర్ విష్ణు అండదండలతో నా ఇంటికి నిప్పు పెట్టించి, నా యింటిని లూటీ చేయించిన ఘనుడవు నీవు. నీ సోదరుడు జేసీ దివాకర్‌రెడ్డి వందలాది మందిని వెంటేసుకుని వెళ్లి ప్రబోధానంద ఆశ్రమంలో అల్లర్లు చేయించి ఒకరి మరణానికి కారణమయ్యారు. మట్కా డాన్‌ను అరెస్ట్ చేసేందుకు వచ్చిన పోలీసులపై దాడి చేయించి, వారి వాహనాలను దహనం చేసేలా ఉసిగొల్పి పోలీసు వ్యవస్థను కించపర్చిన చరిత్ర నీది' అని గుర్తు చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధిపై దృష్టి సారించకుండా నిత్యం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, పోలీసులను ఆడిపోసుకుంటున్నావన్న విషయం తాడిపత్రి ప్రజలకు అన్ని తెలుసన్నారు. ప్రశాంతంగా ఉన్న తాడిపత్రిని సర్వనాశనం చేయడం కోసం జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారని, దీనిని ప్రజలందరూ గమనించాలని కోరారు. మాజీ కౌన్సిలర్ బాబు, ఎమ్మార్పీఎస్ నేత గురుశంకర్, వైఎస్సార్‌సీపీ నేత నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాత్రి 10 వరకు వ్యాపారాలు చేసుకోవచ్చు

- వ్యాపారులపై ఎలాంటి ఆంక్షలూ లేవు
- తాడిపత్రి డీఎస్పీ చైతన్య

తాడిపత్రి అర్బన్: తాడిపత్రి పట్టణంలో రాత్రి పది గంటల వరకు వ్యాపారాలు నిర్వహించుకోవచ్చని డీఎస్పీ వీఎన్‌కే చైతన్య తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి ఆంక్షలూ లేవని స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కిరాణా షాపులు, తోపుడు బండ్లు, హోటళ్లను రాత్రి ఎనిమిది గంటలకే పోలీసులు మూయించి వేస్తున్నారని కొందరు చేస్తున్న వ్యాఖ్యలు నిరాధారమని పేర్కొన్నారు. కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని, అలాంటివి నమ్మకుండా ప్రశాంతంగా వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచించారు.

బైక్‌పై జింక దూకి వ్యక్తికి గాయాలు



గాయపడిన పులికొండ

గుత్తి రూరల్: మండలంలోని వన్నేదొడ్డి శివారులో పవర్ గ్రిడ్ సమీపంలో సోమవారం రాత్రి బైక్‌పైకి జింక దూకి పులికొండ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. గుత్తి ఆర్ఎస్‌కు చెందిన పులికొండ పని నిమిత్తం వన్నేదొడ్డిలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. పని ముగించుకొని ఇంటికి వస్తుండగా ఎన్టీపీసీ వద్ద రోడ్డు దాటుతున్న జింక బైక్‌పైకి దూకింది. జింక ఒక్కసారిగా మీద పడటంతో భయపడ్డ పులికొండ బైక్ నుంచి కింద పడి స్పృహ తప్పాడు. వెనుక వస్తున్న వారు గమనించి 108 వాహనంతో గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తీసుకెళ్లారు.

సంక్షిప్త సమాచారం

'స్పందన'కు ఆరు వినతులు

గుత్తి రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి ఆరు వినతులు అందినట్లు తహసీల్దార్ మహబూబ్ బాషా తెలిపారు. ఎంఈఓ రవినాయక్, ఈఓఆర్డీ శివాజీరెడ్డి, ఏపీఓ మద్దిలేటి పాల్గొన్నారు.

హెల్మెట్‌తో సురక్షిత ప్రయాణం

యల్లనూరు: హెల్మెట్ ధరించి గమ్యాలను సురక్షితంగా చేరుకోవాలని ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు. సోమవారం తిరుమలాపురం క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. రికార్డులు లేని పలు వాహనదారులకు అపరాధరుసుం విధించారు. ఆటోలు, జీపుల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు తప్పవన్నారు. ఏఎస్ఐ సంపత్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

స్పోర్ట్స్, గేమ్స్ మీట్‌లో విద్యార్థుల ప్రతిభ

తాడిపత్రి టౌన్: అనంతపురం పాలిటెక్నికల్ కళాశాలలో ఈనెల 5వ తేదీ నుంచి 7వరకు జరిగిన రీజనల్ స్థాయి ఇంటర్ పాలిటెక్నికల్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్‌లో తాడిపత్రి ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనపరచి పలు విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శైలేంద్రకుమార్ తెలిపారు. కబడ్డీ బాలుర విభాగంలో జిల్లా స్థాయి ప్రథమ స్థానం, షాట్‌పుట్‌లో నరేష్, షేక్షావలి తొలి రెండు స్థానాల్లో నిలిచారన్నారు. షటిల్ బ్యాడ్మింటన్ బాలుర సింగిల్స్ విభాగంలో షేక్షావలి రన్నర్‌గా నిలిచారన్నారు.

కూలీల సంఖ్య పెంచండి

గుంతకల్లు రూరల్: కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ జాషువా ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏపీఓ సాలయ్యతో కలిసి ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని 25 గ్రామ పంచాయతీలకు కలిపి 8 వేలకు పైగా జాబ్ కార్డ్స్, 18,200 మంది కూలీలు ఉండగా కేవలం 500 మంది కూలీలు మాత్రమే హాజరవుతున్నారన్నారు. గ్రామాల్లో దండోరా వేయించడంతోపాటు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఇంటింటికీ తిరిగి కూలీలకు అవగాహన కల్పించాలన్నారు.

విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం



బస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

యాడికి: కుందన కోట గ్రామంలో 30 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు సాగర్ సిమెంట్ యాజమాన్యం ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసింది. సోమవారం బస్సును గుడిపాడు సర్పంచు దండు సావిత్రి, వైఎస్సార్‌సీపీ నేత దండు రాముడు, కంపెనీ ప్రతినిధులు ప్రారంభించారు. ఇటీవల జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యాక్రమంలో విద్యార్థులు పడుతున్న కష్టాలను వారి తల్లిదండ్రులు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే స్పందించి సాగర్ సిమెంట్ వారితో మాట్లాడి విద్యార్థులకు రానుపోను ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. బస్సు సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యేతోపాటు సాగర్ సిమెంట్ యాజమాన్యానికి విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

రైతు మృతి

పామిడి: పాళ్యంతండాలో ఆత్మహత్యకు యత్నించిన రైతు సోమవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన లక్ష్మన్ననాయక్(50) తనకున్న మూడెకరాలతో పాటు మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని కొన్నేళ్లుగా వరి పంట సాగుచేసేవాడు. పంటలు సరిగా పండక రూ.10 లక్షల దాకా అప్పులు చేశాడు. తన మూడెకరాలు అమ్మినా అప్పులు తీరకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఈక్రమంలో గురువారం కౌలుపొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మక్క, ఇద్దరు పిల్లలున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

శ్మశాన వాటిక స్థలం పరిశీలన

పుట్లూరు: ఎల్లుట్ల గ్రామంలో వివాదంగా మారిన శ్మశాన వాటిక స్థలాన్ని సోమవారం తహసీల్దార్ సుమతి పరిశీలించారు. పట్టా భూమిలో సమాధులు ఉన్నాయని భూమిని కొనుగోలు చేసిన వ్యక్తులు నెల రోజుల క్రితం వాటిని తొలగించడంతో వివాదం ఏర్పడింది. అయితే ఎన్నో ఏళ్లుగా ఉన్న సమాధులను ఎలా తొలగిస్తారంటూ గ్రామస్తులు(శ్మశాన వాటికను వినియోగించే రెండు సామాజిక వర్గాలు) రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం గ్రామానికి చెందిన రత్నమయ్య అనే వ్యక్తి అనారోగ్యంతో మరణించడంతో ఆయన అంత్యక్రియలు తమ భూమిలో చేయరాదని భూ యజమానులు అడ్డుచెప్పడంతో విషయం తెలుసుకున్న తహసీల్దార్ గ్రామానికి చేరుకుని సమస్యపై ఆరా తీశారు. రత్నమయ్య అంత్యక్రియలు పూర్తి చేసుకునేలా అధికారులు నచ్చజెప్పారు. అయితే సమస్యకు పరిష్కారం చూపాలంటూ గ్రామస్తులు, భూ యజమానులు అధికారులను కోరారు. తాడిప్రతి సీఐ పెద్దయ్య, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.


అగ్ని ప్రమాదంలో మొక్కలు దగ్ధం

గుంతకల్లు రూరల్: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో నెలగొండలో రైతు జయరామిరెడ్డి పొలంలో దాదాపు మూడెకరాల్లో మొక్కలతోపాటు వ్యవసాయ పరికాలు దగ్ధమయ్యాయి. జయరామిరెడ్డి తనకున్న ఐదెకరాల పొలంలో ఏడాదిన్నర క్రితం ఉపాధి హామీ పథకం ద్వారా 400 మామిడి, 800 జామ మొక్కలు సాగు చేశాడు. పొలంలో అంతర సేద్యం చేయకపోవడంతో గడ్డి బాగా పెరిగింది. ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు గడ్డికి నిప్పుపెట్టడంతో దాదాపు మూడెకరాల్లో మొక్కలు, డ్రిప్ పరికరాలు దగ్ధమయ్యాయి. ఘటనలో రూ.2.5 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు.

శివ మాలధారులకు భిక్ష

యాడికి: మండల కేంద్రంలోని పార్వతి సమేత భోగలింగేశ్వర దేవాలయం వద్ద శివ మాలధారులకు సోమవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు భిక్ష ఏర్పాటు చేశాడు. ఈ సందర్భంగా శివ మాలధారులు మాట్లాడుతూ శివ మాల ధరించిన భక్తులకు సోమవారం నుంచి శివ రాత్రి పర్వదినం వరకు రోజూ మధ్యాహ్నం బొంబాయి రమేష్ నాయుడు భిక్ష ఏర్పాటు చేశాడని, శివ మాలధారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే చొరవతో వీధిదీపాల మరమ్మతు



భగత్‌సింగ్‌నగర్‌లో విద్యుత్తు దీపాన్ని మరమ్మతు చేస్తున్న సిబ్బంది ,ఇందిరా నగర్‌లో..

తాడిపత్రి టౌన్ : ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చొరవతో పట్టణంలో వీధిదీపాల సమస్యకు పరిష్కారం దొరికింది. మున్సిపల్ అధికారులు వీధి దీపాల మరమ్మతుకు శ్రీకారం చుట్టారు. వీధి దీపాలు, డ్రైనేజీ మూతల మరమ్మతు పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసిందని మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ జబ్బార్‌మియా తెలిపారు. ఇప్పటికే సీపీఐ కాలనీ, భగత్‌సింగ్‌నగర్, మున్సిపల్ కార్యాలయం రోడ్డు, వాంబే కాలనీ, ఇంద్రానగర్ వీధుల్లో దెబ్బతిన్న విద్యుత్ దీపాలను మరమ్మతు పూర్తి చేశామన్నారు. పది రోజుల్లో అన్ని వార్డుల్లో విద్యుత్ దీపాల మరమ్మతులతోపాటు, డ్రైనేజీల మూతలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.